

పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి దిన పత్రిక కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఏవైనా సమస్యలుంటే క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
A.C.O - 9003200801
S.R - 9551168092
ఆంధ్రజ్యోతి చిరునామా : జి4, గ్రౌండ్ ఫ్లోర్, రామ్స్ అపార్ట్‌మెంట్, ఓల్డ్ నెం. 40, న్యూ నెంబర్ 35, విజయ రాఘవ రోడ్డు, టి.నగర్, చెన్నై - 600 017

మురుగన్ ఆలయాలకు పోటెత్తిన భక్తులు

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక సందర్భంగా పళని దండాయుధపాణిస్వామి, తిరుచెందూరు సెంథిల్ ఆండవర్ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శుక్రవారం నుంచి మూడు రోజులు వరుస సెలవులు, ఆడికృత్తిక కలిసి రావటంతో భక్తులు ఈరెండు క్షేత్రాలకు భారీ సంఖ్యలోవెళ్లారు. తిరుచెందూరు సుబ్రహ్మణ్యస్వామి ఆలయ కుంభాభిషేకం జరిగి నెల రోజులు దాటడం, ఆడికృత్తికను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రానికే వేల సంఖ్యలో భక్తులు ఆ క్షేత్రానికి చేరుకున్నారు. శనివారం వేకువజామునే సముద్రతీరంలో స్నానమాచరించిన, నాళికినరు వద్ద పవిత్రజలాలను శిరస్సుపై చల్లుకుని క్యూలైన్లలో నిలిచారు. వీరందరికీ స్వామివారి దర్శనానికి సుమారు 7 గంటలు పట్టింది. ఉదయం నుండి సాయంత్రం దాకా భక్తులకు అన్నదానం నిర్వహించారు.


తిరుచెందూరు ఆలయంలో భక్తుల రద్దీ


పళని ఆలయం ముందు గుమికూడిన భక్తులు

పళనిలో కావళ్లు...

పళని దండాయుధపాణి ఆలయం శనివారం వేకువజాము నుంచే భక్తులతో కిక్కిరిసింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన భక్తుల్లో చాలా మంది కావళ్లతో వచ్చి మొక్కులను తీర్చుకున్నారు. ఇదే విధంగా వంటికి, నోటికి శూలాలు గుర్చుకుని కొండ ఆలయం చుట్టూ సందడి చేశారు. భక్తులకు ప్రసాదం, మజ్జిగను ఆలయ నిర్వాహకులు అందించారు.

తిరుత్తణిలో ఆడికృత్తిక వేడుకలు


పట్టువస్త్రాలు సమర్పిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు


కావళ్లతో ఆలయానికి తరలివచ్చిన భక్తజనం

తిరుత్తణి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణిలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయానికి ఆడి ఉత్సవాలు సందర్భంగా శనివారం ఉదయం పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తారు. లక్షలాదిమంది భక్తులు కావళ్లతో పాదయాత్రగా వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. గత గురువారం ప్రారంభమైన ఆడి కృత్తిక ఉత్సవాలు మంగళవారం వరకు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 5 గంటలకు అర్చకులు స్వామివారికి ప్రాతఃకాలార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ తదితర రాష్ట్రాలనుండి లక్షలాది మంది భక్తులు శనివారం వేకువజామునే వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో శరీరానికి శూలాలు గుచ్చుకున్న వారు, కావళ్లతో వచ్చిన భక్తులంతా చేరి ఆటపాటలతో సుబ్రహ్మణ్యస్వామి కీర్తిస్తూ నృత్యంచేసి సందడి చేశారు. ఎస్పీ వివేకానంద శుక్లా నేతృత్వంలో సుమారు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

టీటీడీ పట్టువస్త్రాల సమర్పణ...

తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆడి కృత్తిక ఉత్సావాలను పురస్కరించుకుని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు శనివారం ఉదయం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. టీటీడీ తరపున మురుగన్‌కు పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో శనివారం టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలను ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారికి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చేతుల మీదుగా స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించడం ఎంతో సంతోషంగా ఉందని, ఎన్నో జన్మల పుణ్యంగా భావిస్తున్నానని, స్వామివారి కృపాకటాక్షాలు భక్తులందరిపై ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం అర్చకులు, ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ట్రస్టీ సురేష్‌బాబు తదితరులు బీఆర్ నాయుడిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు.

మంత్రి పెరియసామిపై ఈడీ పంజా

- చెన్నై, దిండుగల్ నివాసాల్లో తనిఖీలు
- ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తనిఖీ యత్నం
- అధికారులపై కేసు నమోదు



మంత్రి పెరియసామి - దిండుగల్‌లో ఈడీ తనిఖీలు జరుగుతున్న నివాసం బయట గుమికూడిన డీఎంకే శ్రేణులు

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఐ.పెరియసామిపై (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) ఈడీ పంజా విసిరింది. చెన్నై, దిండుగల్ లోని ఆయన నివాసాల్లో ఈడీ అధికారులు శనివారం ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అదే సమయంలో పెరియసామి కుమారుడు, పళని అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే సెంథిల్‌కుమార్, కుమార్తె ఇందిర ఇళ్లల్లో కూడా సోదాలు నిర్వహించారు. దిండుగల్ గోవిందాపురం అశోక్‌నగర్‌లోని పెరియసామి నివాసానికి శనివారం ఉదయం 6.45 గంటలకు వెళ్లిన పది మంది ఈడీ అధికారులు తనిఖీలు ప్రారంభించారు. ఆ సమయంలో పెరియసామి, ఆయన సతీమణి అక్కడే ఉన్నారు. అక్రమ నగదు బట్వాడాపై జరుగుతున్న విచారణలో భాగంగా తనిఖీలు చేస్తున్నట్లు పెరియసామికి తెలిపిన అధికారులు సోదాలను ప్రారంభించారు. ఈడీ తనిఖీలు జరుగుతున్న ఈ మూడు నివాసగృహాల వద్ద సాయుధులైన సీఆర్‌పీఎఫ్ సిబ్బంది కాపలాగా ఉన్నారు.

అల్లుడి నూలుమిల్లులో...

ఆత్తూరు నియోజకవర్గం సింగారకోటలో పెరియసామి అల్లుడు ద్వారకనాథన్ నడుపుతున్న నూలుమిల్లులోనూ ఈడీ అధికారులు తనిఖీలు జరిపారు. నగరంలోని గ్రీన్‌వేస్‌రోడ్డులో ఉన్న పెరియసామి అధికారిక నివాసంలోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేశారు. ఆ ఇంటిలో పనిచేస్తున్న డఫేదార్ చేత సంతకాలు తీసుకుని మూసి ఉన్న గదుల తాళాలను పగులగొట్టి లోనికి వెళ్ళి సోదాలు జరిపారు. ఈ దాడుల సందర్భంగా లభించిన పత్రాల నకలు తీయడానికి శనివారంసాయంత్రం బయటి నుండి కంప్యూటర్ ప్రింటింగ్ మిషన్లను ఈడీ అధికారులు తీసుకెళ్లారు. దీంతో తనిఖీల్లో కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పెరియసామి, ఆయన కుటుంబీకుల నివాసాలు, సంస్థల్లో ఈడీ తనిఖీలు జరుగుతున్నట్లు వార్త రాగానే సచివాలయంలో మంత్రి గదికి తాళాలు వేసి పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

దాడులకు భయపడం

కేంద్రంలోని బీజేపీ పాలకులకు సానుకూలంగా వ్యవహరిస్తున్న ఈడీ దాడులకు భయపడే ప్రసక్తే లేదని డీఎంకే వ్యవస్థాపక కార్యదర్శి ఆర్ఎస్ భారతి, ఆ పార్టీ ఎంపీ కనిమొళి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. పెరియసామిపై అన్నాడీఎంకే పాలకులు బనాయించిన తప్పుడు కేసు తిరగదోడేలా ఈడీ తనిఖీలు జరిగాయని, ఈడీ చర్యలను చట్ట ప్రకారం ఎదుర్కొంటామని వారు స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తనిఖీ యత్నం

చేపాక్ వద్దనున్న ఎమ్మెల్యేల క్వార్టర్స్‌లో పెరియసామి, ఆయన కుమారుడు సెంథిల్‌కుమార్ గదుల్లో తనిఖీ చేసేందుకు వెళ్ళిన ఈడీ అధికారులపై ట్రిప్లికేన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ క్వార్టర్స్‌లో 200 మందికి పైగా ఎమ్మెల్యేలకు గదులున్నాయి. క్వార్టర్స్ చుట్టూ నిరంతరం సాయుధ పోలీసులు కాపలా కాస్తుంటారు. ఆ క్వార్టర్స్‌లోకి ఎమ్మెల్యేలు, వారి సహాయకులు, శాఖల అధికారులు, కుటుంబ సభ్యులకు మాత్రమే అనుమతిస్తారు. ఈ పరిస్థితుల్లో నలుగురైదురు ఈడీ అధికారులు పెరియసామి, సెంథిల్‌కుమార్ గదులు ఎక్కడున్నాయంటూ ఆ క్వార్టర్స్‌లో తిరుగున్నవారిని అడుగుతూ వెళ్లారు. విషయం తెలుసుకున్న ట్రిప్లికేన్ పోలీసులు ఈడీ అధికారులపై అక్రమచొరబాటుకు సంబంధించిన కేసు నమోదు చేశారు.

పాతకేసులపై విచారణకేనా?

మంత్రి పెరియసామి గతంలో గృహనిర్మాణశాఖ మంత్రిగా ఉన్నప్పుడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి సహాయకుడికి ఇల్లు కేటాయించడంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపణలు వచ్చాయి. ఆ కేసుపై విచారణ జరిపిన స్థానిక కోర్టు కేసు కొట్టివేసింది. ఆ తర్వాత ఆ కేసుపై సమగ్రంగా విచారణ జరపాలంటూ హైకోర్టు ఉత్తర్వు జారీచేసింది. ఆ విచారణలో భాగంగానే ఈ తనిఖీలు జరిగినట్లు చెబుతున్నారు.

త్వరలో చెన్నై సలహామండలి నియామకం

- టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): త్వరలోనే టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహామండలిని నియమిస్తామని టీటీడీ పాలకమండలి చైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. శనివారం నగరానికి వచ్చిన బీఆర్ నాయుడు.. టి.నగర్‌లోని శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయాల అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదాశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ మీడియాతో మాట్లాడుతూ- వెంకటనారాయణరోడ్డులో వున్న శ్రీవారి ఆలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని, గర్భాలయ విమాన గోపుర నిర్మాణం కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించామన్నారు. త్వరలోనే సలహామండలిని ఏర్పాటు చేసి రెండు టీటీడీ ఆలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలనే సంకల్పించామని, ఇప్పటికే 9 రాష్ట్రాల్లో ఆలయాలుండగా, మిగిలిన రాష్ట్రాల్లో స్థలం కేటాయింపుల కోసం చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్, నూతలపాటి శ్రీకృష్ణ, మాజీ సభ్యులు మోహన్‌రావ్, చంద్రశేఖర్, చలపతి, రామాంజనేయులు, సురేష్, రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే కుమారగురు తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ నాయుడితో శేఖర్ ప్రత్యేక భేటి

నగరానికి చేరుకున్న బీఆర్ నాయుడుతో ప్రముఖ పారిశ్రామికవేత్త, టీటీడీ చెన్నై సమాచార కేంద్ర సలహామండలి మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్ ఓ హోటల్లో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శ్రీవారి నూతన ఆలయ నిర్మాణంతో పాటు వివిధ అంశాలపై వీరిద్దరూ చర్చించుకున్నట్లు తెలిసింది.


అమ్మవారి ఆలయంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో ప్రముఖులు

అశ్రునయనాల నడుమ అధికార లాంఛనాలతో

ఇలా గణేశన్ అంత్యక్రియలు


ఇలా గణేశన్ మృతదేహం


ప్రధాని నరేంద్రమోదీ తరపున నివాళులర్పిస్తున్న సీఎం స్టాలిన్, మంత్రులు

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత, నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేశన్ అంత్యక్రియలు ఆత్మీయులు, పార్టీ ప్రముఖులు, కుటుంబ సభ్యుల అశ్రునయనాల నడుమ సైనిక లాంఛనాలతో బీసెంట్‌నగర్ శ్మశానవాటికలో శనివారం సాయంత్రం జరిగాయి. స్థానిక అపోలో ఆస్పత్రిలో వారం రోజులకు పైగా చికిత్స తీసుకుంటూ శుక్రవారం రాత్రి ఎనిమిది గంటల ప్రాంతంలో ఇలా గణేశన్ కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆస్పత్రి నుంచి ఆయన భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో టి.నగర్ నివాసానికి తరలించారు. ఈ విషయం తెలియగానే ముఖ్యమంత్రి స్టాలిన్ హుటాహుటిన అక్కడికి చేరుకుని దివంగత నేత భౌతికకాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత గవర్నర్ ఆర్ఎన్ రవి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, పార్టీ నేతలు హెచ్‌రాజా, పొన్ రాధాకృష్ణన్ తదితరులు వెళ్ళి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటలకు టి.నగర్ వెంకటనారాయణరోడ్డులో నటేశన్ పార్కు ఎదురుగా ఉన్న కార్పొరేషన్ క్రీడా మైదానంలో నగర ప్రముఖులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు.


అన్నాడీఎంకే తరపున నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి డి.జయకుమార్

ప్రధాని తరపున స్టాలిన్ నివాళి..

ప్రధాని నరేంద్రమోదీ అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శనివారం ఉదయం నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేశన్ భౌతికకాయంపై పుష్పవలయాన్ని ఉంచి నివాళులర్పించారు. ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం నుంచి నగరానికి తీసుకువచ్చిన పుష్పవలయాన్ని ఆయన భౌతికకాయం ఉంచిన అద్దాలపేటికపై ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. కేంద్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఎల్.మురుగన్, అర్జున్ రామ్ మెఘువాల్, నాగాలాండ్ ముఖ్యమంత్రి నైబ్యూ రియో, ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీ తదితరులు కూడా నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రులు ఎం.సుబ్రమణ్యం, రఘుపతి, ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, అన్నాడీఎంకే తరపున మాజీ మంత్రి డి.జయకుమార్, నామ్‌తమిళర్ కట్చి నేత సీమాన్, సినీ నటుడు శరత్‌కుమార్, కరునాగరాజన్, హిందూ మక్కల్ కట్చి ఏత అర్జున్ సంపత్, సీపీఎం నేత రంగరాజన్, వీఐటీ ఛాన్సలర్ కె.విశ్వనాథన్ తదితరులు భౌతికకాయంపై పుష్పవలయాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. సాయంత్రం నాలుగు గంటలకు టి.నగర్ నుంచి ఇలా గణేశన్ భౌతిక కాయాన్ని బీసెంట్‌నగర్ శ్మశానవాటిక వరకు ఊరేగింపు తీసుకెళ్లారు. విద్యుత్ దహనవాటికలో అధికార లాంఛనాలతో కుటుంబ సభ్యులు శాస్త్రోక్తంగా అంత్యక్రియల నిర్వహించారు.

అవినీతిలో డీఎంకేకు జాతీయ అవార్డు ఖాయం

- ఈపీఎస్ ఎద్దేవా


సమావేశంలో మాట్లాడుతున్న ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అవినీతిలో డీఎంకేకు జాతీయస్థాయిలో అవార్డు ఇవ్వొచ్చని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఎద్దేవా చేశారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో గత నెల 7న కోవై జిల్లా మేట్టుపాళయం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్ర శనివారం తిరువణ్ణామలై చేరుకుంది. వేంగిక్కాళ్ ప్రాంతంలోని ఓ కల్యాణ మండపంలో నేత కార్మికులు, రైతులు, కుల వృత్తి సంఘాల ప్రతినిధుల సభలో ఈపీఎస్ మాట్లాడారు. ఎన్నికల సమయాల్లో ప్రజలకు ఇచ్చే హామీలను రాజకీయ పార్టీలు అధికారంలో కూర్చున్నాక 12 నెలల్లో నెరవేర్చాలని, అలా జరిగితేనే అధికార పార్టీని ప్రజలు నమ్ముతారన్నారు. అయితే 500లకు పైగా హామీలతో రాష్ట్ర ప్రజల్ని నమ్మించి అధికారంలోకి వచ్చిన డీఎంకే ప్రభుత్వం నాలుగేళ్లు గడిచినా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లంచం పెరిగిందని, అధికార పార్టీ కౌన్సిలర్ల నుండి మంత్రుల వరకు అవినీతికి పాల్పడుతున్నారని, ఇందులో డీఎంకేకు జాతీయ స్థాయిలో అవార్డు ఇవ్వచ్చని ఈపీఎస్ విమర్శించారు. స్వయం వృత్తుల్లో పాల్గొంటున్న వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వం భారీగా పన్నులు విధించడం సరికాదన్నారు. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో తాను ముఖ్యమంత్రిగా వ్యవహరించిన సమయంలో కరువు తాండవించిన సమయంలో తాము నష్టపోయిన కులవృత్తుల వారికి ప్రభుత్వం తరుపున ఆర్థిక సాయమందించామని, ఇది రాష్ట్ర చరిత్రలో మొదటిసారని తెలిపారు. ఆధునిక పరిజ్ఞానం క్రమంగా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో పరిస్థితికి తగ్గట్టుగా వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మార్పులు చేయాల్సివుండగా, సీఎం స్టాలిన్ ప్రభుత్వం వీటి కోసం పట్టించుకోవట్లేదన్నారు. నదీ జలాలను శుద్ధీకరించేందుకు 'నడందాయ్ వాలి కావేరి' అనే పథకాన్ని అమలుపరిచేందుకు ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అనుమతి పొంది, ఏడాదికి రూ. 11,500కోట్లు రాబట్టామని, ఆ తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఈ పథకం అమలు జరుగలేదన్నారు. తిరువణ్ణామలై జిల్లాలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నట్లు పలువురు సభలో మాట్లాడారని, విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధన గురించి అవగాహన కల్పిస్తేనే ప్రమాదాలు కొంతవరకైనా తగ్గుతాయన్నారు. ప్రభుత్వం పరిమితికి లోబడి రుణాలు పొందాలని, ముఖ్యంగా కేంద్రప్రభుత్వం అనుమతించిన మేరకే రుణాలు పొందాలని, సీఎం స్టాలిన్ ప్రభుత్వం పరిమితి దాటి ప్రజలపై రుణభారం మోపిందని మండిపడ్డారు. ఈ సభలో పలు పార్టీలకు చెందిన సుమారు 300 మందికి పైగా కార్యకర్తలు అన్నాడీఎంకేలో చేరారు.

సమాచార దృష్టి

కేజ్రీవాల్‌కు సీఎం స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆమ్ ఆద్మీ జాతీయ సమన్వయకర్త అరవింద్ కేజ్రీవాల్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు సీఎం తన ఎక్స్ పేజీలో... "ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ సమన్వయకర్త అరవింద్ కేజ్రీవాల్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. మీకు ఆరోగ్యంగా మరింత కాలం ప్రజలకు సేవచేసి, విజయం సాధించాలని కోరుకుంటున్నాను. ప్రజల హక్కుల కోసం మీ నాయకత్వంలో జరిపే పోరాటాలు మరింత బలోపేతం కావాలి" అంటూ సీఎం స్టాలిన్ ట్వీట్ చేశారు.

రేపు మెడికల్ కోర్సుల సీట్ల కేటాయింపు

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వైద్యకళాశాలలు ఎంపిక చేసుకొనేందుకు అవకాశం కల్పించిన నేపథ్యంలో, విద్యార్థుల సీటు కేటాయింపు జాబితా ఈ నెల 18వ తేదీన విడుదల కానుంది. వైద్య కోర్సులకు నిర్వహించిన కౌన్సెలింగ్ శనివారం ముగిసింది. ఆదివారం ర్యాంకుల జాబితా విడుదల చేయనున్నారు. సోమవారం (ఈ నెల 18వతేది) సీటు కేటాయింపు జాబితా విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

20 నుంచి బీఎడ్ తరగతులు

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): బీఎడ్ కోర్సు మొదటి సంవత్సరం తరగతులు ఈ నెల 20వ తేది నుంచి ప్రారంభం కానున్నాయి. తమిళనాడు ఉపాధ్యాయ విద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఏడు ప్రభుత్వ విద్యా కళాశాలలు, 14 ఎయిడెడ్ కళాశాలల్లో 2,040 బీఎడ్ సీట్లున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరం బీఎడ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 9వ తేది వరకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ క్రమంలో, బీఎడ్ మొదటి సంవత్సరం తరగతులు ఈ నెల 20 నుంచి ప్రారంభమవుతాయని విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

జామ్, పండ్ల రసాల తయారీపై శిక్షణ

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయం సమాచార శిక్షణ కేంద్రంలో ఈ నెల 21న జామ్, పండ్ల రసాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. గిండి తిరువిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ సిప్కాట్ ఎదురుగా ఉన్న కేంద్రంలో పలు రకాల జామ్‌లు, మామిడి, నిమ్మరసం తయారీలపై శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 044-295530048 అనే నెంబరు సంప్రదించవచ్చు.

మెట్రోలో ఒకేరోజు 4.4 లక్షల మంది ప్రయాణం

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైళ్లలో ఒకేరోజు 4.4 లక్షల మంది ప్రయాణించారు. ఈ మేరకు సీఎంఆర్ఎల్ విడుదల చేసిన ప్రకటనలో... నగరంలో రెండు మార్గాల్లో నడుపుతున్న మెట్రో రైళ్లలో ప్రతిరోజు సుమారు 3.25 లక్షల మంది ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో, స్వాతంత్ర్య దినోత్సవం రోజైన శుక్రవారం ఒకే రోజు మెట్రో రైళ్లలో 4,06,066 మంది ప్రయాణం చేశారు. నగరంలో మెట్రోరైలు ప్రారంభించినప్పటి నుంచి ఒకే రోజు అత్యధిక మంది ప్రయాణించినట్లుగా నిలిచింది. అదే సమయంలో, నగరంలో గత ఏడాది అక్టోబరులో వైమానిక దళ కార్యక్రమాల సందర్భంగా, మెట్రోరైళ్లలో ఒకేరోజు 4 లక్షల మంది ప్రయాణించడం ఇప్పటివరకు అత్యధికంగా ఉందని సీఎంఆర్ఎల్ తెలిపింది.

ప్రతినెలా ప్రొఫెసర్ల వివరాల పరిశీలన

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల వివరాలు ప్రతినెలా పరిశీలించాలని అన్నా విశ్వవిద్యాలయం నిర్ణయించింది. అన్నా విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజనీరింగ్ కళాశాలలు గుర్తింపు పొందేందుకు ప్రొఫెసర్ల సంఖ్య అధికంగా చూపించిన వ్యవహారం ఇటీవల వెలుగుచూసింది. అదే సమయంలో, ఒక ప్రొఫెసర్ పలు కళాశాలల్లో పనిచేస్తున్నట్లు తనిఖీల్లో బయటపడ్డాయి. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన అన్నా విశ్వవిద్యాలయం, కళాశాలల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్ల ఆధార్ కార్డు, ఇతర వివరాలను ఆన్‌లైన్‌లో పరిశీలించింది. ప్రతి నెలా వాటిని పరిశీలించాలని, లేని ప్రొఫెసర్లను విధుల్లో ఉన్నట్లు చూపే కళాశాలలపై చర్యలు చేపట్టనున్నట్లు అన్నా విశ్వవిద్యాలయం హెచ్చరించింది.

21 నుంచి నందనం వైఎంసీఏలో 'గ్రామోత్సవాలు'

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): 'సెంపొళి' పేరుతో నాలుగు రోజులు 'గ్రామోత్సవాలు' నందనం వైఎంసీఏ మైదానంలో ఈ నెల 21న ప్రారంభం కానున్నాయి. చెన్నై కార్పొరేషన్, తొండైమాన్ మండలం ట్రస్ట్, ఉళవన్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకల్లో పశువుల ప్రదర్శన, కోడి, పొట్టేళ్ల పందేలు, జల్లి కట్టు ఎద్దులు, పెంపుడు శునకాల ప్రదర్శన ఉంటుంది.. అలాగే వాటికి అందాల పోటీలు నిర్వహించి ఎంపికైన మూడు కోళ్ల, మేకలు, నాటు పశువులు, శునకాలకు రూ.2,001 నుంచి రూ.12,001 వరకు బహుమతులు అందించనున్నారు. 24వ తేది వరకు జరుగనున్న ఈ వేడుకల్లో ఐదేళ్లలో పున్న చిన్నారులకు ఉచిత ప్రవేశం కాగా, 6 నుంచి 15 ఏళ్లలోపున్న వారికి రూ.100, 15 ఏళ్లకు పైబడిన వారికి రూ.150 రుసుము నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారా, నేరుగాను టిక్కెట్లు కొనుగోలు చేయవచ్చు. మరిన్ని వివరాలకు www.sempozhil.org అనే వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలిపారు.

తూత్తుకుడిలో సంగంకాలంనాటి

శిల్పాలు లభ్యం



తవ్వకాల్లో బయటపడిన మట్టి,రాతిశిల్పాలు

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా తరువాయికుళంలో జరిపిన తవ్వకాల్లో సంగకాలం నాటి మట్టి, రాతి శిల్పాలు లభ్యమైనట్లు పురావస్తుశాఖ నిపుణుడు రాజేష్ సెల్వరతి పేర్కొన్నారు. ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ, తూత్తుకుడి జిల్లా వట్టపిడారంలోని తడువైసిలారం గ్రామంలో ముల్లపొదలతో నిండిన ప్రభుత్వ స్థలంలో ఇటీవల జరిపిన తవ్వకాల్లో సంగకాలంలో మట్టి, రాతి, సున్నంతో తయారుచేసి శిథిలమైన భవన నిర్మాణానికి ఉపయోగించిన స్తంభాలు సుమారు 20 అడుగుల ఎత్తు 15 అడుగుల వెడల్పుతో బయల్పడినట్లు తెలిపారు. వాటితో పాటు రాతి బండలో ఒకేపీఠంపై కుళశేఖరపట్టినం జ్ఞానమునీశ్వరుడు, ముత్తారమ్మన్ కూర్చున్నట్టు చెక్కిన విగ్రహాలు, తరువాయికుళం గ్రామంలోని కాడేరిస్వామి ఆలయంలో భక్తులు టెంకాయలు కొట్టేందుకు సంగకాలంలో ఉపయోగించిన మట్టితో చేసిన బలిపీఠం తదితర అరుదైన కళాఖండాలు బయల్పడ్డాయని, వీటిని పరిశోధించగా అవి 13 నుండి 15వ శతాబ్దం కాలంలో వినియోగించినట్లుగా ఆయన నిర్ధారించారు.

మత్తు బిళ్లలతో 33 మంది అరెస్టు

వేలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పళ్లికొండ ప్రాంతంలో మత్తు ఇంజక్షన్లు, మత్తుమాత్రలు వినియోగిస్తున్న 33 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని నెలలుగా వేలూరు, పళ్లికొండ, పశుముత్తూరు తదితర ప్రాంతాల్లో మత్తు బిల్లలను వినిమోగిస్తున్నట్లుగా పోలీసులకు అందిన సమాచారంతో నిఘా పెంచారు. శుక్రవారం సాయంత్రం పక్కా ఆధారాలతో 33 మందిని అరెస్టు చేశారు. ఇదిలా వుండగా మత్తు బిల్లలు వినియోగించడంలేదని నిందితుల కుటుంబీకులు పోలీస్‌స్టేషన్ బయట నిరసన వ్యక్తం చేశారు.

ఆమ్నీ బస్సుల్లో అధిక ఛార్జీలు

● రూ.1.26 లక్షల జరిమానా

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరుస సెలవుల సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి అధిక ఛార్జీలు వసూలుచేసిన 18 ఆమ్నీ బస్సులకు రూ.1.26 లక్షల జరిమానా విధించారు. స్వాతంత్ర్య దినోత్సవం, శని, ఆదివారాలు వరుస సెలవులు రావడంతో నగరం నుంచి ప్రజలు సొంతూళ్లకు పయనమయ్యారు. ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఆమ్నీ బస్సులు ఒక్కసారిగా ధరలు పెంచాయంటూ రవాణా శాఖ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మీనంబాక్కం, కిలాంబాక్కం, పెరుంగళత్తూర్ తదితర ప్రాంతాల్లో మోటారు వాహన ఇన్‌స్పెక్టర్లు ఆమ్నీ బస్సులను ఆపి తనిఖీ చేశారు. 18 ఆమ్నీ బస్సులకు రూ.1.26 లక్షల జరిమానా విధించారు. అలాగే, ప్రయాణికుల నుంచి వసూలుచేసిన అదనపు ఛార్జీ తిరిగి వారికి అప్పగించారు.

నగరం నుంచి 3 లక్షల మంది...

రాజధాని నగరం చెన్నై నుంచి సొంతూళ్లకు రెండు రోజుల్లో 3 లక్షల మంది ప్రయాణించారని రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలియజేసింది. ప్రయాణికులు సౌకర్యార్థం ఈ నెల 14వ తేది అర్ధరాత్రి 12 గంటల నుంచి 15వ తేది వేకువజామున 3 గంటల వరకు 2,092 బస్సులు, 1,160 ప్రత్యేక బస్సులు మొత్తం 3,252 బస్సులు నడుపగా, 1,78,860 మంది ప్రయాణించారు. అలాగే, 13వ తేది 2,092 బస్సులు, 436 ప్రత్యేక బస్సులు నడుపగా 1,35,040 మంది ప్రయాణించారు. ఆ ప్రకారం, 13 నుంచి 15వ తేది వేకువజామున 3 గంటల వరకు నడిపిన 5,780 బస్సుల్లో 3,13,900 మంది ప్రయాణించారని ఎస్ఈటీసీ తెలిపింది.

మృతిచెందిన అర్చకుడి నివాసంలో చోరీ

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మృతిచెందిన అర్చకుడి ఇంట్లో 107 సవర్ల నగలు చోరీకి గురయ్యాయి. తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టణానికి చెందిన అర్చకుడు జ్ఞానముత్తు పది రోజుల క్రితం మృతిచెందాడు. అంత్యక్రియల తర్వాత జ్ఞానముత్తు భార్య ప్రియ పుట్టింటికి వెళ్లింది. శుక్రవారం సాయంత్రం ఆమె ఇంటికి రాగా, తలుపులు బద్దలు కొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెంది ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని 107 సవర్ల నగలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇంట్లో ఎవరూ లేరని తెలుసుకుని చోరీకి పాల్పడి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చిన పోలీసులు, నిందితుల కోసం గాలిస్తున్నారు.

నేడు కళాసుధ ఆధ్వర్యంలో 'కృష్ణాష్టమి'

అడయార్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు ఆదివారం జరుగనున్నాయి. ఆళ్వార్‌పేట, టీటీకే సాలైలో ఉన్న మ్యూజిక్ అకాడెమీలో సాయంత్రం 4.29 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, సభాధ్యక్షులుగా ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, విశిష్ట అతిథులుగా జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, సినీ నిర్మాతలు టీజీ విశ్వప్రసాద్, గూడూరు నారాయణ రెడ్డి, ఫోర్-పి ఇంటర్నేషనల్ (చెన్నై) మేనేజింగ్ డైరెక్టర్ బెల్లంకొండ కృష్ణమూర్తి, క్వాలిటీ మ్యాట్రిక్స్ గ్రూపు చైర్మన్ వల్లేపల్లి శశికాంత్ పాల్గొంటారని కళా సుధ తెలుగు అసోసియేషన్ వ్యవస్థాపకుడు బేతిరెడ్డి శ్రీనివాస్ శనివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా 'కృష్ణం వందే జగద్గురుం - ప్రతిభా పురస్కార్' పేరిట అవార్డులను తెలంగాణ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే కె.వెంకట రమణా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వైకుంఠ ప్రభాకర్ చౌదరి, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ నూతలపాటి శ్రీకృష్ణ, భారత్ భారతి ఫౌండర్ వినయ్ భాయ్ పత్రాలె, నటి లయ, నటి నమిత, హీరో తేజా సజ్జలకు ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించనున్నారు.

కలుసుకున్న తండ్రీకొడుకులు

● పరస్పరం నమస్కరించుకున్నాం.. అంతే!
● సర్వసభ్య మండలి జరుపుతాం
● పీఎంకే నేత రాందాస్



సరస్వతి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న రాందాస్, అన్బుమణి, కుటుంబ సభ్యులు

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): చాలాకాలంగా ఎడమొహం పెడమొహంగా వున్న తండ్రీకొడుకులు పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్, అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి ఎట్టకేలకు కలుసుకున్నారు. అయితే తన సతీమణి సరస్వతి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కుమారుడు అన్బుమణితో పరస్పరం పలకరించామని, రాజకీయాల గురించి ప్రస్తావించలేదని, ఆదివారం ముందస్తు ప్రణాళిక ప్రకారం పార్టీ సర్వసభ్య సమావేశం నిర్వహించి తీరుతామని డాక్టర్ రాందాస్ పేర్కొన్నారు. రాందాస్ సతీమణి సరస్వతి జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి విల్లుపురం జిల్లా దిండువనం సమీపంలోని తైలాపురం గార్డెన్‌లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ నేపథ్యంలో, తన తల్లి జన్మదిన వేడుకల్లో అన్బుమణి పాల్గొనడంతో వారిమధ్య నెలకొన్న సమస్యలు తొలగాయా అని విలేఖర్లు రాందాస్‌ను ప్రశ్నించారు. తాము పరస్పరం పలకరించుకున్నామని, అంతకు మించి ఏదీ మాట్లాడలేదన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు పుదుచ్చేరిలో పీఎంకే ప్రత్యేక సర్వసభ్య మండలి సమావేశం జరుగుతుందని, ఇందులో ఎటువంటి మార్పులు ఉండబోవని రాందాస్ స్పష్టం చేశారు.

అందియూరు గురునాథస్వామి ఆలయంలో

సీఎం సోదరుడి ప్రత్యేక పూజలు



ఆలయం సమీపంలో సంతలో ఓ గుర్రాన్ని ఆసక్తిగా చూస్తున్న తమిళరసు, ఆయన సతీమణి మోహనాంబాళ్

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా అందియూరు గురునాథస్వామి ఆలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ సోదరుడు తమిళరసు, కుటుంబ సభ్యులు శనివారం స్వామివారిని దర్శించి, పూజలు నిర్వహించారు. ప్రస్తుతం గురునాథస్వామి ఆలయంలో ఆడిమాస ఉత్సవాలు గురువారం నుంచి జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఏర్పాటు చేసిన గుర్రాల సంతను తిలకించడానికి రాష్ట్రం నలుమూలల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా వ్యాపారులు, భక్తులు వందల సంఖ్యలో రోజూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం ఆ ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి సోదరుడు తమిళరసు, కుటుంబీకులను ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం తమిళరసు, ఆయన సతీమణి మోహనాంబాళ్ తదితరులు గుర్రాల సంత, పశువుల సంత తిలకించారు.

పులి, ఏనుగు దంతాల విక్రయానికి యత్నం

● నలుగురి అరెస్టు

అడయార్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా అటవీ ప్రాంతంలో ఏనుగు, పులి వంటి అడవి జంతులను వేటాడి, వాటి దంతాలను అక్రమంగా విక్రయించే నలుగురిముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వీరిని కుమరి జిల్లాకు చెందిన కుట్టప్పన్, నాగప్పన్, విశ్వంభరం, షాజహాన్‌గా గుర్తించారు. వీరు జిల్లాలోని అటవీ ప్రాంతంలోకి వెళ్లి జంతువులను వేటాడి పులి, ఏనుగు దంతాలను సేకరించి, వాటిని కేరళ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్నట్టు పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో వారిపై వివిధ సెక్షన్ల కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

యువకుడి హత్యకేసులో పది మంది అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరంలోని పాత ఇనుపసామాన్ల గోదాములో పనిచేసిన యువకుడి హత్యకేసులో పోలీసులు పది మందిని అరెస్టు చేశారు. పదేళ్ల క్రితం మాధవరంలోని ఇనుపసామాన్ల గోదాములో పనిచేసిన లోకేష్ (24)ను గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. దీనిపై మాధవరం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ముమ్మరం చేశారు. కాగా లోకేష్ మిత్రులే ఈ హత్యకు పాల్పడినట్లు తెలుసుకుని పూవరసన్ (26), జెరోమ్ (20), రాజేష్ (19) సహా 10 మందిని శుక్రవారం రాత్రి అరెస్టు చేసి, వారి నుండి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా అంబళ్ల వేడుక

వేలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా సలవన్‌పేటలో కొలువైన దేవి కడుమారియమ్మన్ ఆలయంలో శనివారం అంబళ్ల కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో తరలివెళ్లి అమ్మవారి అభిషేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు చంద్రన్, ఉపకార్యదర్శి శంకర్, ధనశేఖరన్ పర్యవేక్షణలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కార్తికేయన్ హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అన్నాడీఎంకే నేతలు ఆర్‌కే అప్పు, రఘు, కౌన్సిలర్ ఎళిలరసన్ పాల్గొన్నారు.

రాపిడో డ్రైవర్లకు ఉచితంగా'కూలీ' ప్రదర్శన

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నగరంలో రాపిడో సంస్థ తరపున ఆటోలు, కార్లు, బైకులు నడిపే డ్రైవర్లకు 'కూలీ' చిత్రం ఉచితంగా వీక్షించే అవకాశం కల్పించింది. రాయపేట ఉడ్‌ల్యాండ్స్ థియేటర్, మౌంట్ రోడ్డులోని దేవి థియేటర్‌లో రాపిడో డ్రైవర్లు 'కూలీ' చిత్రం తిలకించారు.

లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి 35 యేళ్ల జైలు శిక్ష



నిందితుడిని కోర్టుకు తీసుకెళ్తున్న పోలీసులు

టి.నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుపత్తూరు జిల్లా ఆంబూరు సమీపంలోని ఓ హాస్టల్‌లో చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వెంకటేశన్ (67) అనే వృద్ధుడికి 35 యేళ్ల జైలు శిక్ష విధించారు. తిరుపత్తూరు జిల్లా ఆనైకట్టు సమీపంలోని వేప్పంకుప్పం ప్రాంతానికి చెందిన కోటీశ్వరి అనే వృద్ధురాలు 2018వ సంవత్సరంలో అక్కడున్న బాలికల హాస్టల్‌లో వంట చేస్తుండేది. ఆ నేపథ్యంలో కోటీశ్వరి హాస్టల్‌లోని బాలికల్లో కొందరిని తన ఇంటి పనులకు తీసుకెళ్లేది. అదే సందర్భంలో కోటీశ్వరి భర్త వెంకటేశన్ ఇంటిపనులకు వచ్చే బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడుతుండేవాడు. దీంతో ఆరుగురు బాలికలు హాస్టల్ వార్డెన్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే ఆయన ఆ బాలికలను వేప్పంకుప్పం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని కోటీశ్వరి, ఆమె భర్తను అరెస్టు చేశారు. 2018లో నమోదైన ఈ కేసుపై తిరుపత్తూరు జిల్లా కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసు విచారణ జరుగుతుండగా కోటేశ్వరి మృతి చెందింది. ఈ నేపథ్యంలో వెంకటేశన్‌కు 35యేళ్ళ జైలు శిక్ష విధిస్తూ తిరుపత్తూరు జిల్లా కోర్టు తీర్పు వెలువరించింది.

యాదవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు



కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు

తిరుత్తణి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో శనివారం యాదవ సంఘం నిర్వాహకుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండపంలో అందంగా అలంకరించిన శ్రీకృష్ణుని ప్రతిమను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం ఆద్యంతం ఉత్సాహభరితంగా జరిగింది. రాత్రి 7 గంటలకు పళ్లిపట్టు యాదవ సంఘ నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ విజయాలు యాదవ్, సంఘ నాయకులు మునికృష్ణ నాటామా, పరుశురామ్ యాదవ్, గోపాల్ యాదవ్, సుధాయాదవ్ పాల్గొన్నారు.

వేలూరులో అంతర్జాతీయ జ్యోతిష్య సిద్ధాంతుల సదస్సు



సభలో మాట్లాడుతున్న కమిటీ నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు సహా పలు జిల్లాల జ్యోతిష్యుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ జ్యోతిష్యుల అవగాహన సదస్సు శనివారం ఉదయం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రాణిపేట, తిరువళ్లూరు, తిరుపత్తూరు తదితర జిల్లాలకు చెందిన సంఘ అధ్యక్షులు, జ్యోతిష్య పండితులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఏలగిరి ప్రాంత జ్యోతిష్యశాస్త్ర రీసెర్చర్ రోషన్ అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న అబిరామిశేఖర్, బాల, శరవణ సోమసుందరం ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నిర్వాహకులు పవలకన్నన్, బాలమురుగన్, ఎల్.జయసూర్య, వాస్తు బాలాచందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు సంక్షేమ సహాయాల పంపిణీ



వృద్ధులకు సంక్షేమ సహాయాలను అందజేస్తున్న నిర్వాహకులు

వేలూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపం వేలప్పాడిలోని వృద్ధాశ్రమంలో శనివారం ఉదయం హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వృద్ధులకు సంక్షేమ సహాయాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా వేలూరు దేవాదాయశాఖ ట్రస్ట్ అధ్యక్షుడు అశోకన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ నిర్వాహకులు రవిచంద్రన్, భూపతి, అరుణగిరి, శివ, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పాఠశాలకు రూ.2 కోట్ల స్థలం విరాళం



స్థల పత్రాలు అందజేస్తున్న పొన్.గోవిందరాజ్

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తంజావూరు జిల్లా ఒరత్తనాడు సమీపంలోని ప్రభుత్వ పాఠశాలకు రూ.2 కోట్ల విలువైన స్థలాన్ని సింగపూర్ పారిశ్రామికవేత్త పొన్.గోవిందరాజ్ ఉచితంగా అందజేశారు. తిరుమంగళకోట కీళయూరు ప్రాంతంలోని ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో కీళయూరు తదితర గ్రామాలకు చెందిన సుమారు 250 మందికి పైగా విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు, విదేశాల్లో ఉంటున్న స్థానికులు, పూర్వ విద్యార్థులు కలసి 'తిరుమంగళకోట తాలూకా విద్య అభివృద్ధి సమూహ ట్రస్ట్' ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో, తిరుమంగళకోట కీళయూరుకు చెందిన పారిశ్రామికవేత్త పొన్.గోవిందరాజ్ (80), పాఠశాల కోసం సుమారు రూ.2 కోట్ల విలువైన 30 వేల చ.అ స్థలాన్ని ఉచితంగా అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొన్న గోవిందరాజ్, స్థలానికి సంబంధించి పత్రాలను ట్రస్ట్ సభ్యుల సమక్షంలో ప్రధానోపాధ్యాయుడికి అప్పగించారు. ఈ సందర్భంగా గోవిందరాజ్ మాట్లాడుతూ... విద్య మాత్రమే ఉన్నత స్థాయికి తీసుకువస్తుందని, విద్యార్థులు క్రమశిక్షణతో విద్య అభ్యసించి చదివిన గ్రామానికి, తల్లిదండ్రులకు గౌరవం చేకూర్చాలని విద్యార్థులకు సూచించారు.

నెల్లయప్పర్ ఆలయానికి కొత్త ఏనుగు



నెల్లయప్పర్ ఆలయం కోసం కొనుగోలు చేసిన గున్న ఏనుగు

టి.నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి నగరంలోని సుప్రసిద్ధ నెల్లయప్పర్ ఆలయానికి ఉత్తరాఖండ్ రాష్ట్రం నుంచి గున్న ఏనుగును తెప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ ఆలయంలోని కాంతిమతి అనే ఏనుగు ఇటీవల మృతి చెందడంతో కొత్త ఏనుగు కొనాలని ఆలయ నిర్వాహకులు నిర్ణయించారు. ఆ మేరకు హిందూ దేవాదాయ శాఖ, అటవీ శాఖ ఉన్నతాధికారులు ఇటీవల ఉత్తరాఖండ్ వెళ్లి ఆలయంలో భక్తులకు సేవలందించేందుకు ఓ ఏనుగును కొనుగోలు చేశారు. దానిని ఉత్తరఖాండ్ నుండి మదురైకి విమానంలో తీసుకొచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మదురై నుంచి లారీలో నెల్లయప్పర్ ఆలయానికి ఏనుగును తీసుకురానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా నెల్లయప్పర్ ఆలయం కోసం కొనుగోలు చేసిన గున్న ఏనుగు ఫొటోలు, వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

రాష్ట్ర మ్యాప్ ఆకారంలో నర్సింగ్ విద్యార్థినులు



తమిళనాడు రాష్ట్ర మ్యాప్ నమూనాలో విద్యార్థినులు

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా జీటీఎన్ నర్సింగ్ కళాశాల వైదానంలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. తమిళనాడు నర్సుల శిక్షణ సంఘం, తమిళనాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో, రాష్ట్రవ్యాప్తంగా 176 నర్సింగ్ కళాశాలలకు చెందిన 3,256 మంది విద్యార్థినులు రాష్ట్ర మ్యాప్ ఆకారంలో నిలబడి రికార్డు సృష్టించారు. ఈ రికార్డును ఆసియా, ఇండియా రికార్డ్ అధినేత వివేక్ పరిశీలించి, నిర్వాహకులకు సర్టిఫికెట్ అందజేశారు.

ఈపీఎస్ పర్యటనలో అపశ్రుతి

● కూలిన స్వాగతం ఆర్చి ● తృటిలో తప్పించుకున్న వాహనం



పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రచారంలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. శనివారం తిరువణ్ణామలై సమీపం వేంగిక్కాల్ ప్రాంతంలోని ప్రైవేటు విడిది గృహంలో రైతుల, చేనేత సహా పలు రంగాలకు చెందిన ప్రతినిధులతో పళనిస్వామి సమావేశమయ్యారు. అనంతరం సెంగం నియోజకవర్గంలో ప్రజలను కలుసుకునేందుకు ఆయన తన వాహనంలో బయల్దేరారు. నియోజకవర్గ సరిహద్దుల్లో పళనిస్వామికి ఆహ్వానం పలుకుతూ ఆ పార్టీ శ్రేణులు ఆర్చి ఏర్పాటుచేశారు. పళనిస్వామి భద్రతా వాహనం, ఆయన ప్రయాణిస్తున్న ప్రచార రథం ఆర్చి దాటిన వెంటనే అది కుప్పకూలి, వెనుక వాహనంపై పడింది. గమనించిన పళనిస్వామి వెంటనే వాహనం ఆపి, కిందకు దిగి వాహనంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ఆటోలో మహిళకు నొప్పులు

● ప్రసవం చేసిన లేడీ కానిస్టేబుల్‌కు ప్రశంసలు



ప్రసవం తర్వాత తిరుప్పూరు ఈఎస్ఐ ఆస్పత్రిలో చేరిన భారతి. ప్రసవం చేసిన కానిస్టేబుల్ కోకిల

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరులో వాహనాల తనిఖీ సందర్భంగా ఆటోలో పురుటి నొప్పులతో వెళ్తున్న మహిళకు డ్యూటీలో ఉన్న ఓ మహిళా కానిస్టేబుల్ సకాలంలో ప్రసవం జరిపి పలువురి ప్రశంసలందుకుంది. తిరుప్పూరు మేల్‌పాళయం వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో వేగంగా వెళ్తున్న ఆటోలో మహిళ కేకలు వినిపించి పోలీసులు దానిని ఆపారు. ఆ ఆటోలో ఒడిశాకు చెందిన భారతి పురుటి నొప్పులతో బాధపడుతోందని, ఆమె భర్త ఆస్పత్రికి తీసుకెళుతున్నాడని గమనించారు. అక్కడే డ్యూటీ లో ఉన్న లేడీ కానిస్టేబుల్ కోకిల్ ఆమె పరిస్థితి గమనించింది. నర్సింగ్ కోర్సు కూడా చదివిన కానిస్టేబుల్ కోకిల ఆటోలో ఉన్న భారతి పరిస్థితిని అర్థం చేసుకుని, ఆమెకు పురుడు పోయడానికి సిద్ధమైంది. ఆమెతోపాటు డ్యూటీలో ఉన్న మరికొంతమంది మహిళా కానిస్టేబుళ్లు సాయపడ్డారు. పావుగంటల తర్వాత భారతికి సుఖ ప్రసవం ద్వారా ఆడబిడ్డ జన్మించింది. ఆ తర్వాత తల్లీబిడ్డను అంబులెన్స్ లో ఆస్పత్రికి తరలించారు. ఆటోలో వెళ్తున్న గర్భిణికి లేడీ కానిస్టేబుల్ కోకిల పురుడుపోసిన విషయం శనివారం ఉదయం తిరుప్పూరు నగరమంతటా వ్యాపించింది. తిరుప్పూరు సిటీ పోలీసు కమిషనర్ రాజేంద్రన్ తదితర ఉన్నతాధికారులంతా కానిస్టేబుల్ కోకిలను ప్రశంసించారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు ఘన వీడ్కోలు



గుర్రపు బగ్గీలో హెచ్‌ఎంను ఊరేగిస్తున్న విద్యార్థులు

పెరంబూర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పదవీవిరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. నాగపట్టణం జిల్లా వేదారణ్యం సమీపం తనికోట ప్రభుత్వ మహోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా తమిళ్ సెల్వన్ 20 ఏళ్లుగా పనిచేసి, ఆయన శుక్రవారం పదవీవిరమణ పొందారు. ఆయనకు వీడ్కోలు పలికేందుకు గ్రామంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గుర్రపు బగ్గీలో తమిళ్ సెల్వన్‌ను ఆసీనులను చేసి, గ్రామంలోని వీధుల్లో ఊరేగిస్తూ, రోడ్డుకు ఇరువైపులా విద్యార్థులు నిలబడి ఆయనపై పూలు చల్లారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో వీడ్కోలు సభ నిర్వహించారు.



తిరుత్తణి ఆలయంలో దైవదర్శనం చేసుకున్న మంత్రి శేఖర్ బాబుకు విభూది, కుంకుమను అందజేస్తున్న ఆలయ పూజారి

ఆరుపదులు దాటినా
అద్భుత ఆవిష్కరణలు

● తాటాకుల బొమ్మల తయారీలో సరికొత్త రికార్డు

● కాదేదీ కళకు అనర్హం...

ఆయన వయస్సు అరవై ఆరేళ్లు. ఆరో తరగతి వరకే చదివిన ఆ వృద్ధుడి చేతిలో అందమైన కళాకృతులు జీవం పోసుకుంటున్నాయి. ప్రాచీన కాలంలో రాసేందుకు తాళపత్రాలు (తాటి ఆకులు) ఉపయోగించేవారని విన్నాం. అదే విధంగా తాటాకుల బుట్టలు, టోపీలు గురించి కూడా తెలుసు. అయితే ఈ వృద్ధుడు మాత్రం తాటాకులతో అందమైన బొమ్మలను తయారు చేస్తున్నారు. ఆ వృద్ధుడి హస్తకళానైపుణ్యం ప్రపంచమంతటికీ తెలిసింది. ఎన్నో రికార్డులు అందుకున్న ఆ కళాకారుడు పాల్‌పాండి. అరవైఆరేళ్ల కళాకారుడి జీవన సమాహారం నేటి ఆదివారం ప్రత్యేకం..

(టి.నగర్, ఆంధ్రజ్యోతి)

తూత్తుకుడి జిల్లా కరుంగుళం ప్రాంతానికి చెందిన పాల్‌పాండి ఎవరూ సాహసించని విధంగా తాటాకులతో బొమ్మలు తయారు చేసారు. ఆయనకు ఫ్యూచర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, యూనివర్సల్ అచీవర్స్ బుక్ రికార్డ్స్, డాక్టరేట్ ఇన్ బుక్ రికార్డింగ్ వంటి సంస్థలు అవార్డులు ప్రదానం చేశాయి. మోకాళ్లనొప్పులు, కీళ్లనొప్పులు, విషపురుగుల కాటుకు మందువేయటం వంటి ద్వారా వచ్చే సంపాదనతో జీవనం సాగిస్తున్న ఆయనకు తాటాకులతో బొమ్మలు చేయడమే నిత్యకృత్యంగా మారింది. ఇటీవల మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం, మాజీ ముఖ్యమంత్రులు కరుణానిధి, జయలలిత, కామరాజర్ వంటి నాయకుల బొమ్మలను ఐదారు నెలలపాటు కష్టపడి తయారు చేశారు. తాజాగా ఏడున్నర అడుగుల ఎత్తున్న ప్రధాని మోదీ బొమ్మ రూపొందించారు. ఆ బొమ్మలో ప్రధాని మోదీ ధరించే కంటి అద్దాలు సైతం చూపరులను ఆకట్టుకునేలా తాటాకులతోనే తయారు చేశారు. ఇంతకీ ఈ బొమ్మలు తయారు చేసి అమ్ముకుంటున్నారా? అంటే లేదు. తన ఇంటిలోనే మినీ ఎగ్జిబిషన్‌లా ఉంచి వాటిని చూస్తూ ఆనందిస్తుంటారు. అదే సమయంలో స్థానికులు కూడా పాల్‌పాండి తయారు చేసిన బొమ్మలు చూసి ఆయనను ప్రశంసిస్తున్నారు.

ఏ సంపాదన లేకుండా ఈ బొమ్మలను తయారు చేయడం ఎందుకని పాల్‌పాండిని ప్రశ్నిస్తే 'తాటి కల్లు గీయటం మా పూర్వీకుల కులవృత్తి. తాటి చెట్టే మాకు కల్పవృక్షం. ఆ వృత్తిలో భాగంగానే తాటాకులతో బొమ్మలు చేయడం నాకు ఆత్మ సంతృప్తే కాదు ఆత్మానందం లభిస్తోంది' అంటూ బదులిచ్చారు. 2018లో కిందపడి ఇంటిపట్టునే గడిపాను. అప్పట్లో ఏం చేయాలో తోచలేదు. ఉన్నట్టుండి తాటాకులతో మనిషి బొమ్మలను తయారు చేయాలనే ఆసక్తి కలిగింది. అప్పటి కప్పుడు నా మనస్సుకు తోచిన నాయకుల బొమ్మలను తాటాకులతో అందంగా తయారు చేయగలిగాను.

SUNDAY SPECIAL


ప్రధాని మోదీ, కామరాజర్, జయలలిత, కరుణానిధి బొమ్మలు

తొలి బొమ్మ తాజ్‌మహల్...

మొట్టమొదట ప్రపంచ వింతల్లో ఒకటైన తాజ్‌మహల్‌ను తయారు చేశాను. అందరూ మెచ్చుకున్నారు. ఆ తర్వాత తిరుమల ఆనందనిలయాన్ని తయారు చేశాను. అదే సమయంలో తాటాకులతో చర్చి తయారు చేస్తావా?అని అడిగారు. 'నాకు కులమతాల పట్టింపులు లేవు క్రైస్తవుల తీర్థయాత్ర స్థలం వేలాంకన్ని తయారు చేస్తానని తాటాకులతో ఆ ఆలయం బొమ్మ అద్భుతంగా తయారు చేశాను. తాను తయారు చేసే బొమ్మలకు సంబంధించి వాటి ఫొటోలు, చిత్రలేఖనాలు కళ్లముందుంచుకుని పాల్‌పాండి తయారు చేయడం లేదు. ఏ ఆకారమైనా, ఎవరిబొమ్మనైనా మనస్సులోనే ఊహించుకునే తాటాకుల అల్లుతూ తయారు చేస్తారు. అన్నా డీఎంకే, డీఎంకే పార్టీ చిహ్నాలు రెండాకులు, ఉదయసూర్యుడి బొమ్మల్ని నిమిషాల్లో తయారు చేస్తానని, ఆ పార్టీ నాయకులు తన ఇంటికొస్తే ఈ బొమ్మలిచ్చి స్వాగతం పలుకుతానని పాల్‌పాండి తెలిపారు. తాజాగా వినాయకుడి బొమ్మను తయారు చేశాను. ఆ బొమ్మను తాటాకులు అల్లుతూ తయారు చేయడానికి నాలుగు నెలలు పట్టిందన్నారు. ఆ వినాయకుడి బొమ్మను చూసేందుకు ప్రజలంతా నా ఇంటి వద్ద క్యూ కట్టారు. ఆ బొమ్మను ఏదైనా గుడికి కానుకగా ఇవ్వకూడదా? అని చెబుతుంటారని తెలిపారు. ఇంటిదగ్గరే ఉండి తయారు చేసిన బొమ్మలకు ప్రపంచ రికార్డులు వస్తాయని కలలో కూడా ఊహించలేదని పాల్‌పాండి చెప్పారు. ప్రపంచ రికార్డు సంస్థలిచ్చిన ప్రశంసాపత్రాలకు కూడా తాటాకుల ఫ్రేమ్ కట్టి ఇంటిగోడలపై వేలాడదీశారు. తానెక్కడికి వెళ్ళినా తాటాకులతో తయారైన చెప్పులేసుకుని వెళ్తానని, తాటాకులతో తయారైన సూట్‌కేసే వాడతానని నవ్వుతూ తెలిపారు. 'పరియేరుం పెరుమాళ్' అనే సినిమాలో తాటాకులతో తయారు చేసిన సూట్‌కేసు అడిగారని, వెంటనే దానిని కానుకగా ఇచ్చేశానని చెప్పారు. యేళ్ల తరబడి తయారు చేసిన ఈ తాటాకుల బొమ్మలను కంటికి రెప్పలా కాపాడటమే తనకు కష్టంగా ఉందన్నారు. దుమ్ము పడకుండా కనీసం వారానికి ఒకమారైనా తప్పకుండా శుభ్రం చేయాల్సి ఉంటుందన్నారు. నాయకుల బొమ్మలు తయారు చేసేటప్పుడు వారి దేహాలను సులువుగా త్వరగా చేస్తానని, అయితే వారి ముఖాల అల్లిక కొన్ని సందర్భాల్లో కుదరదని, అరకొరగా ఉండే ఆ బొమ్మలను పారేస్తానని తెలిపారు. రాత్రి పూట ఉన్నట్టుండి ఏ నాయకుడి బొమ్మయినా చేయాలనే ఆలోచన పుడుతుందని, వెంటనే తన మంచం పక్కనే సన్నగా కత్తిరించి ఉన్న తాటాకులను అల్లుతూ ఉంటానని, అది చూసి తన కుమారుడు 'మా నాన్నకు తాటి ఆకుల దెయ్యం పట్టిందోచ్' అంటూ తనను ఆటపట్టిస్తుంటాడని, అవేవీ పట్టించుకోకుండా వేకువజాములోగా తాను అనుకున్న బొమ్మ తయారు చేస్తానని పాల్‌పాండి తెలిపారు. తన ప్రాణమున్నంతవరకూ తాటాకులతో నాకు నచ్చిన బొమ్మలను తయారు చేస్తూనే ఉంటానని, ఆ బొమ్మలను అందరూ చూసి ఆనందించాలన్నదే తన కోరిక అంటూ పాల్‌పాండి గంభీరంగా చెబుతున్నారు.




పాల్‌పాండి వాడుతున్న తాటాకుల పాదరక్షలు, మాస్కు, వాటర్‌బాటిల్

ఇస్కాన్‌లో కోలాహలంగా శ్రీకృష్ణజయంతి

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈస్ట్‌కోస్ట్ రోడ్డులో ఉన్న ఇస్కాన్ ఆలయంలో శ్రీకృష్ణజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణులకు పంచామృతం, నారికేళ జలం, పండ్ల రసాలతో ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం 4.30 గంటలకు గురుపూజ, మంగళహారతి కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి జన్మవిశేషాలతో కళాకారులు భక్తిగీతాలు ఆలపించారు. డీజీపీ శంకర్ జివాల్ రాధాకృష్ణుల దర్శనం చేసుకున్నారు. అనంతరం జన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులందరికీ ఇస్కాన్ ప్రతినిధులు ప్రసాదం పంపిణీ చేశారు.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు - భజన కార్యక్రమంలో కళాకారులు

'18 మాల్'ను ప్రారంభించిన సినీ ప్రముఖులు

అడయార్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఆధునిక జీవనశైలిని అమితంగా ఇష్టపడే వారి అభిరుచికి అనుగుణంగా ఈస్ట్ కోస్ట్ రోడ్డులోని కాణాత్తూరులో నెలకొల్పిన '18 మాల్'ను ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు శ్రీనివాస్ తాజాగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 18 మాల్ డైరెక్టర్ ప్రియదర్శిని కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జాన్ క్రిస్ టెర్రన్స్ తదితరులు పాల్గొన్నారు. 18 మాల్ అనేది కేవలం షాపింగ్ మాత్రమే కాదని, ఆధునిక జీవనశైలిని ఇష్టపడేవారికి ప్రత్యేకమైన డెస్టినేషన్ వంటిందని డైరెక్టర్ ప్రియదర్శిని కుమార్ అన్నారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, ప్రైవసీని ఇష్టపడేవారి కోసం కేఫ్‌లు, వినోదపు కేంద్రాలను వివిధ విభాగాలుగా తీర్చిదిద్దినట్టు వారు పేర్కొన్నారు.


మాల్ ప్రారంభోత్సవ దృశ్యం

కన్నియాకుమారికి పోటెత్తిన పర్యాటకులు

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడు రోజులు సెలవులు రావడంలో రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాలన్నీ పర్యాటకులతో కిటకిటలాడాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి సముద్రతీరంలో సూర్యోదయం వీక్షించేందుకు అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. అనంతరం త్రివేణి సంగమంలో స్నానాలు చేశారు.. సముద్రం మధ్య నిర్మించిన వివేకానంద స్మారక మండపాన్ని సందర్శించేందుకు తెల్లవారుజాము నుండి బోట్‌హౌస్‌లో పర్యాటకులు బారులుతీరారు. వివేకానందుడి స్మారక మండపం, తిరువళ్లువర్ విగ్రహం, అద్దాల వంతెన సందర్శిచారు. శుక్రవారం ఒకేరోజు 10,147 మంది పర్యాటకులు పడవల్లో వెళ్లి ఈ ప్రాంతాలను సందర్శించినట్లు రాష్ట్రప్రభుత్వ పర్యాటకశాఖ తెలిపింది. అలాగే కన్నియాకుమారి భగవతియమ్మన్ ఆలయం, టీటీడీ ఆలయం, కొట్టారం రామాలయం, సుశీంద్ర థానుమాలయస్వామి ఆలయం, భారతమాత ఆలయం, రామాయణ దర్శన ప్రదర్శనశాల, స్వాతంత్ర్య సమరయోధుల స్మారక స్థూపం, మహాత్మా గాంధీ స్మారక మండపం తదితర అన్ని పర్యాటక ప్రాంతాల్లో శనివారం కూడా పర్యాటకులు సందడి చేశారు. దీంతో న్నియాకుమారి సముద్రతీరంలో కోస్ట్‌గార్డ్, గజ ఈతగాళ్లు, పోలీసులతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.


పర్యాటకుల సందడి

నేత్రపర్వంగా సెయింట్ పరలోకమాత
రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి సమీపం కామనాయకన్‌పట్టిలోని సెయింట్ పరలోకమాత ఆలయ వార్షికోత్సవాలు కోలాహలంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం ఉదయం రెండు రథాల ఊరేగింపు అశేష భక్తజనం మధ్య నేత్రపర్వంగా సాగింది. కేరళ, పంజాబ తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు చండీమేళంతో సందడి చేశారు. మదురై బిషప్ అంథోనిస్వామి, సవరిముత్తు నేతృత్వంలోని పాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రథోత్సవం సందర్భంగా కోవిల్‌పట్టి డీఎస్పీ నేతృత్వంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రేమ కథా చిత్రాల్లో నటించాలనివుంది: శ్రీలీల



తనకు ప్రేమకథా చిత్రాల్లో నటించాలని వుందని టాలీవుడ్ యంగ్ హీరోయిన్ శ్రీలీల అంటున్నారు. శివకార్తికేయన్ హీరోగా సుధా కొంగరా దర్శకత్వంలో రూపొందుతోన్న 'పరాశక్తి' చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులోని పాత్రపై ఆమె స్పందిస్తూ, 'నాకు ఇపుడు 24 యేళ్లు.. అందుకే ప్రేమ కథా చిత్రాల్లో నటించేందుకు ఇష్టపడుతున్నాను. నా మానసిక పరిస్థితి ఆ విధంగానే ఉంది. అందుకు అనుగుణంగా పాత్రల ఎంపిక చేసుకోవాలని భావిస్తున్నాను. అయితే, ఇపుడు లేడీ ఓరియంటెడ్ చిత్రాలు అధికంగా వస్తున్నాయి. మహిళల శక్తిసామర్థ్యాలను ప్రోత్సహించే మోటివేషనల్ చిత్రాలను చూస్తుంటే నాకు కూడా అలాంటి చిత్రాల్లో నటించాలన్న ఆశ కలుగుతోంది' అని పేర్కొన్నారు. కాగా, టాలీవుడ్‌లో క్రేజీ హీరోయిన్‌గా గుర్తింపు పొంది శ్రీలీల 'పరాశక్తి' చిత్రం ద్వారా తమిళంలోకి ఎంట్రీ ఇవ్వనున్నారు.

వచ్చే ఆరు నెలల్లో 25 వేల మొక్కలు నాటుతాం

● నటుడు సౌందరరాజా


తన బృందంతో నటుడు సౌందరరాజా

రాష్ట్రాన్ని హరితవనం చేసే కార్యక్రమంలో భాగంగా రాబోయే ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 25 వేల మొక్కలను నాటనున్నట్టు సినీ నటుడు, సంఘ సేవకుడు సౌందరరాజా వెల్లడించారు. 'మన్నుక్కుం మక్కలుక్కుం' అనే పేరుతో ఆయన చారిటబుల్ నిర్వహిస్తూ అనేక మంది పేదలకు సాయం చేస్తున్నారు.

చిత్రజ్యోతి

అలాగే, రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం పెంచడంలో భాగంగా అనేక ప్రాంతాల్లో మొక్కలు నాటుతున్నారు. గడిచిన తొమ్మిదేళ్ళలో 45 వేల మొక్కలను నాటారు. తాజాగా ఆవడి నగర పోలీస్ కమిషనర్ కార్యాలయ ప్రాంగణలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్‌లో తన బృందంతో కలిసి వంద మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ప్రభుత్వం రాష్ట్రాన్ని హరితవనంగా చేసేందుకు చర్యలు చేపడుతోంది. ఇందులోభాగంగా తమ ట్రస్ట్ తరపున ఈ మొక్కలను నాటుతున్నాం. కాగా, శశికుమార్ నటించిన 'సుందరపాండియన్', శివకార్తికేయన్ 'వరుత్తపడాద వాలిబర్ సంఘం', 'ధర్మదురై', 'రెక్క' 'జగమే తందిరమ్' వంటి అనేక విజయవంతమైన చిత్రాల్లో ఆయన నటించారు.

పరువు హత్యల నేపథ్యంలో 'నెల్లై బాయ్స్'

రాష్ట్రంలో పెరిగిపోతున్న పరువు హత్యల నేపథ్యంలో 'నెల్లై బాయ్స్' పేరుతో ఓ చిత్రం రూపొందుతోంది. 'అరువా సండై' అనే సినిమాను నిర్మించిన వి.రాజా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీ ద్వారా అరివళగన్ అనే వర్ధమాన నటుడు హీరోగా పరిచయమవుతున్నారు. హీరోయిన్‌గా హేమా రాజ్‌కుమార్ నటిస్తున్నారు. మరో ముఖ్య పాత్రలో వేల రామ్మూర్తి పోషించే ఈ చిత్రానికి కమల్.జి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా గురించి దర్శకుడు మాట్లాడుతూ, 'సమాజంలో కులాంతర వివాహాలను జీర్ణించుకోలేకపోతున్నారు. అందుకే పరువు హత్యలు జరుగుతున్నాయి. పరువు హత్యలను నేపథ్యంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం.


'నెల్లై బాయ్స్' ఫస్ట్‌లుక్

ఇళయరాజా - వైరముత్తు విడిపోవడానికి కారణం ఇదే

● గంగై అమరన్ వెల్లడి


'కమాండోవిన్ లవ్ స్టోరీ' ఆడియో రిలీజ్ దృశ్యం

సంగీత దర్శకుడు ఇళయరాజా ఎదుగుదలకు తన పాటలే కారణమంటూ గేయరచయిత వైరముత్తు పలు చోట్ల పదే పదే చెప్పడం వల్లే వారిద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తి విడిపోయారని ప్రముఖ సంగీత దర్శకుడు గంగై అమరన్ అన్నారు. ఏపీఏ పిక్చర్స్ బ్యానరులో అనురాధ అన్బరసు నిర్మాణంలో వీర అన్బరసు నటించి దర్శకత్వం వహించిన 'కమాండోవిన్ లవ్ స్టోరీ' ఫస్ట్‌లుక్ కార్యక్రమానికి గంగై అమరన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'కమల్ హాసన్‌తో పోల్చుకుంటే రజనీకాంత్ సాధారణంగా ఉంటారు. ప్రతి ఒక్కరూ అలానే ఉండాలి. కమల్ గురించి అనేక విషయాలు చెప్పొచ్చు. కానీ, ఆయన ఇపుడు ఎంపీ అయ్యారు. ఏడు పదుల వయసులోనూ సూపర్‌స్టార్ రజనీకాంత్ నటిస్తుంటే, నేనెందుకు సంగీతం సమకూర్చకూడదనుకుని, ఇపుడు కొన్ని చిత్రాలకు సంగీతం సమకూర్చుతున్నాను. ఇళయరాజా పదేళ్ళపాటు నన్ను దూరం పెట్టగా, నేను వైరముత్తు దగ్గర పాటలు రాశాను. ఆ సమయంలో ఇళయరాజా ఎదుగుదలకు నేనే కారణమంటూ పలు వేడుకల్లో వైరముత్తు చెప్పేవారు. ఈ విషయాన్ని తెలుసుకున్న నేను ఇళయరాజా దృష్టికి తీసుకెళ్ళగా ఆయన నమ్మలేదు. ఆధారాలతో వాస్తవాన్ని తెలుసుకున్న తర్వాత వైరముత్తు, ఇళయరాజా మధ్య మనస్పర్థలు తలెత్తి దూరమయ్యారు' అని అన్నాన్నారు. ఇదిలావుంటే, ఈ సినిమాలో బబ్లూ పృథ్విరాజ్, శక్తివేల్, వాళై జానకి, ఏంజెల్, శ్రీదేవి తదితరులు నటించారు. కార్తీక్ రాజా సంగీతం.

కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో వాకథాన్

చెన్నై, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని కావేరి హాస్పిటల్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వాకథాన్ జరిగింది. శస్త్రచికిత్సల ద్వారా సంపూర్ణంగా కోలుకున్న రోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలతో అన్నానగర్ టవర్ ప్రాంతంలో ప్రత్యేక వాకథాన్ నిర్వహించారు. హృద్రోగ వైద్యనిపుణులు కూడా పాల్గొన్న ఈ వాకథాన్‌ను అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్ జెండా ఊపి ప్రారంభించారు. కావేరి హాస్పిటల్ వైద్యనిపుణులు డాక్టర్ అన్బరసు మోహన్‌రాజ్, డాక్టర్ పి.మనోహర్, డాక్టర్ సి. సుందర్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి వాకథాన్‌ను ప్రారంభిస్తున్న అన్నానగర్ ఎమ్మెల్యే ఎంకే మోహన్

ఆంధ్ర కళాస్రవంతిలో కృష్ణాష్టమి వైభవం

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు అగ్రహారం రామాలయం వీధిలో ఉన్న ఆంధ్ర కళాస్రవంతి ఆధ్వర్యంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. 'కృష్ణం వందే జగద్గురుం' పేరుతో నిర్వహించిన ఈ వేడుకలకు ఆంధ్ర కళాస్రవంతి అధ్యక్షులు జేఎం. నాయుడు సారథ్యం వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అరుణా శ్రీనాథ్ ప్రార్థన, టీఎస్ శివకుమార్ వేణుగానం, శ్రీవెంకటేశ్వర విద్యాలయ విద్యార్థుల కోలాటం, మైలాపూర్ కేసరి మహోన్నతి పాఠశాల విద్యార్థుల మయసభ, ఎన్ పద్మలత వీణానాదం, తెలుగు తరుణి-చెన్నై సభ్యుల భక్తిగీతాలాపన, ఐదేళ్లలోపు చిన్నారుల చిన్ని శ్రీకృష్ణుడి ఫ్యాన్సీడ్రస్, పిల్లల, దంపతుల ఆటల పోటీలు, లక్కీడిప్ తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా బాలకృష్ణుడు, గోపికల వేషధారణలతో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యం అందరిని ఆకట్టుకుంది. స్రవంతి ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్ వందన సమర్పణ చేయగా, సభ్యులు సాంబశివరావు. జె.సురేష్‌బాబు, మనోహరన్, కేఎం దామోదరన్, వివిధ తెలుగు సంఘాల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పలు పోటీల్లో పాల్గొని గెలుపొందిన వారికి, కళాకారులకు, చిన్నారులకు బహుమతులు, ఆహూతులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


చిన్ని కృష్ణుడు, గోపికల వేషధారణ చిన్నారులతో జేఎం.నాయుడు, జె.శ్రీనివాస్ తదితరులు


ఘనంగా నటి రాజసులోచన 91వ జయంతి

ప్యారీస్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): అలనాటి మేటినటి రాజసులోచన 91వ జయంతి వేడుకలు రోటరి డిస్ట్రిక్ట్-3232, ఎఫ్ ఎంఎల్ఆర్, ఎన్‌జీఎల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగాయి. మైలాపూర్‌లో ఆంధ్ర మహిళాసభలో జరిగిన కార్యక్రమానికి రాజసులోచన కుమార్తె రొటేరియన్ దేవికృష్ణ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా సీనియర్ నటీ ఋషేంద్రమణి మనవరాలు, నటి భవాని హాజరయ్యారు. ముందుగా నిర్వాహకులతో కలిసి ఆమె రాజసులోచన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం నటి భవానికి రాజసులోచన పేరుతో సత్కారం అందజేశారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తమ బామ్మ ఋషేంద్రమణి, రాజసులోచన నటించిన తెలుగు, తమిళ చిత్రాలు ఇప్పటికీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. సినిమాల్లో రాజసులోచన పోషించిన పాత్రలు నేటికీ సజీవంగానే ఉన్నాయని, పలు భాషల్లో 375కు పైగా సినిమాల్లో నటించి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. అనంతరం సభాధ్యక్షులు దేవికృష్ణ మాట్లాడుతూ, తమ తల్లి రాజసులోచన జయంతిని గత ఆరేళ్లుగా నిర్వహిస్తూ సినీ రంగ ప్రముఖులను ఘనంగా సత్కరిస్తున్నట్లుగా తెలిపారు. కార్యక్రమంలో రోటరి క్లబ్‌లో సభ్యులు అలనాటి సినిమా పాటలు శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో చూలైమేడులోని ధాయికడంగళ్ ఆశ్రమానికి చెందిన అంధులైన మహిళలకు చీరలు, అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నటులు నంబియార్, ఆర్ఎస్ మనోహర్ కుటుంబ సభ్యులు, పారిశ్రామికవేత్త శోభారాజా తదితరులు పాల్గొన్నారు.


ప్రముఖ నటి భవానీని సత్కరిస్తున్న రాజసులోచన కుమార్తె దేవికృష్ణ తదితరులు

ప్రత్యేక కథనం - కుప్పం, ఆంధ్రజ్యోతి

ప్రోగ్రెస్ రిపోర్ట్



కడా కార్యాలయం

కుప్పం మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ భవిష్యత్తు రూపం

పారిశ్రామిక కుప్పం చంద్రబాబు లక్ష్యం

- రూ.125 కోట్ల పనులు పూర్తి
- రూ.1167 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి
- మాస్టర్ ప్లాన్‌తో దూసుకుపోతున్న కడా

1989లో చంద్రబాబు రాకతో కుప్పం నియోజకవర్గం రూపురేఖలు మారిపోయాయి. 8 సార్లు ఎమ్మెల్యేగా కుప్పానికి ప్రాతినిధ్యం వహించిన ఆయన మూడోసారి ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఏపీకి నైరుతి మూలలో, తమిళ, కన్నడ సరిహద్దుల్లో విసిరేసినట్టుండే ఈ ప్రాంతం వైపు ప్రపంచం దృష్టి మరల్చేలా చేసిన ఘనత చంద్రబాబుదే. కాంగ్రెస్ పాలనాకాలంలో కుప్పం అభివృద్ధి మందగించేది. వైసీపీ పాలనలో మాత్రం కుప్పంపై కక్ష కట్టేశారు. ఎక్కడి పనులక్కడ స్తంభించిపోయాయి. కుప్పం అభివృద్ధి చతికిలపడింది. 2024లో చంద్రబాబు సారధ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులన్నీ మళ్లీ పట్టాలెక్కాయి. పరుగందుకున్నాయి. నారా చంద్రబాబు నాయుడు ఎనిమిదో సారి కుప్పం ఎమ్మెల్యేగా గెలిచిన తొలి ఏడాదిలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి ఏమిటి? విడుదలైన నిధులెంత? మంజూరైన పనులు ఏవి.. ఈ సంగతుల సమాహారమే ఈ కథనం...



నడిమూరులో ప్రతి ఇంటిమీదా కనిపిస్తున్న సోలార్ ప్యానెల్స్

సోలార్ కరెంటు

కుప్పం నియోజకవర్గం మొత్తం సోలార్ కరెంటు వినియోగించేలా పథక రూపకల్పన జరిగింది. నమూనాగా కుప్పం మండలం నడిమూరు గ్రామాన్ని ఎంచుకున్నారు.జనవరి 6న చంద్రబాబు ప్రయోగాత్మకంగా దీనిని ప్రారంభించారు. గ్రామంలోని వంద ఇళ్లకు సోలార్ ప్యానెల్స్ అమర్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలతోపాటు వ్యవసాయ కనెక్షన్లను సోలార్ విద్యుత్తు మయం చేయడానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ఎస్సీ, ఎస్టీలకు పూర్తి ఉచితంగా సోలార్ విద్యుత్తును అందించనున్నారు. ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి.



లైనింగ్ పనులు పూర్తవడంతో వాన నీటితో నిండుగా కనిపిస్తున్న రామకుప్పం మండల పరిధిలోని హంద్రీ-నీవా కాలువ

కుప్పానికి కృష్ణ నీళ్లు: కృష్ణా జలాలను కుప్పానికి తీసుకురావాలన్నది చంద్రబాబు కల. ఇందుకోసం 2014-2019లో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.575 కోట్ల అంచనా వ్యయంతో కుప్పం బ్రాంచి కాలువ పనులను ప్రారంభించారు. 80 శాతం పనులు పూర్తయ్యాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఇవి ఆగిపోయాయి. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాలువ లైనింగ్ పనులకు 97.7 కోట్లు మంజూరయ్యాయి. 90 శాతం పనులు పూర్తయ్యాయి. హంద్రీ-నీవా కుప్పం బ్రాంచికి కృష్ణా జలాలను ఈనెల 29,30తేదీలలో ముఖ్యమంత్రి స్వయంగా వదులుతారని అంటున్నారు.అలాగే పాలారు మీద ఇప్పటికే ఉన్న చెక్ డ్యామ్‌ల పునరుద్ధరణకు కూడా నిధులు మంజూరయ్యాయి. ఆ పనులు సైతం త్వరలోనే ప్రారంభం కానున్నాయి.



శాంతిపురం మండలం కదిరిఓబనపల్లె రోడ్డు



కుప్పం మండలం కంగుంది పంచాయతీ అంబాపురం ఎస్టీ కాలనీ మీదుగా అంబాపురం నుంచి కాళికాంబ ఆలయానికి వేసిన సిమెంటు రోడ్డు

పారిశ్రామిక కుప్పం: గతంలో కుప్పం వ్యవసాయికంగా అభివృద్ధి చెందేందుకు అనేక పథకాలు రూపకల్పన చేసిన చంద్రబాబు, ఈ సారి పారిశ్రామిక అభివృద్ధిపై దృష్టి పెట్టారు. దీనికోసం కడా ఇప్పటికే పునాది సిద్ధం చేసింది. అలీప్, మదర్ డెయిరీ, ఇ-రాయిస్, టిక్నాల్ ఎనర్జీ, కోఫై క్లాసిక్ ఇండస్ట్రీస్, ఫౌ చెన్, అడిడాస్, యాసిక్స్, న్యూ బ్యాలెన్స్, సాలోమన్ అండ్ టిబర్ ల్యాండ్ తదితర కంపెనీలతో ఇప్పటికే ఎంఓయూలు కుదుర్చుకున్నారు. ఈ కంపెనీలకు నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో భూములను కేటాయించారు.ప్రత్యేక జాబ్ మేళా నిర్వహించి వివిధ కంపెనీల ప్రతినిధులను రప్పించి, నియోజకవర్గంలోని 350 మందికి ఉద్యోగాలు కల్పించారు. ఇంకా 200 మంది యువత ఇంటర్వ్యూల స్థాయిలో ఉన్నారు. ఇవిగాక ఈజీ మార్ట్, 1ఎం1బీల ద్వారా వ్యాపార, కెరీర్ గైడెన్స్ ఇస్తున్నారు. ఈ కంపెనీల ద్వారా సమీప భవిష్యత్తులో సుమారు 30 వేల ఉద్యోగాలు కల్పించాలన్న లక్ష్యం పెట్టుకున్నారు.

విమానాశ్రయం: శాంతిపురం, రామకుప్పం మండలాల మధ్య విమానాశ్రయంతోపాటు పారిశ్రామిక వాడ నిర్మాణానికి 1800 ఎకరాలను సేకరించారు. భూములు ఇచ్చిన రైతులకు ఎకరాకు రూ.16 లక్షలు పరిహారం చెల్లించే ప్రక్రియ కూడా ప్రారంభమైంది. ఏడాదిలో భూములను అభివృద్ధి చేసి, అవసరమైన అనుమతులు రాబట్టి, విమానాశ్రయం పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

- కుప్పం మండలం బైరుగానిపల్లెలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలం కేటాయిస్తూ రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. అలాగే ద్రావిడ విశ్వవిద్యాలయానికి ఇటీవల ఇంజనీరింగు కోర్సులు మంజూరయ్యాయి.
- సింగపూర్ కన్సల్టెన్సీ ద్వారా సర్వే చేసి కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతానికి కడా ద్వారా రూ.56.50 కోట్లు కేటాయించారు. డ్రైనేజీ, కరెంటు, నీటి పైపులు భూగర్భంలోనే నిర్మించే పనులు రెండేళ్లలో పూర్తి చేయనున్నారు.

ఏడాదిలో చేసినవి

పనులు	వ్యయం (రూ.కోట్లలో)
హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ లైనింగ్ పనులు	47.05
తారు రోడ్లు	22.00
సిమెంటు రోడ్లు	20.50
తాగునీటి సరఫరా	08.97
గోకులం షెడ్లు	07.63
వీధి దీపాలు	03.70
ఓహెచ్‌ఆర్‌ఎస్ మరమ్మతులు	02.43
పాఠశాలల ప్రహరీలు	01.64
బీటీ రోడ్ల మరమ్మతులు	01.53
ఆర్ అండ్ బీ నూతన భవనం	01.40
వ్యక్తిగత మరుగుదొడ్లు	01.08
అన్న క్యాంటీన్	00.66
గ్యాస్ కనెక్షన్లు	00.36
ఏరియా ఆస్పత్రి అభివృద్ధి	00.18
ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి, శ్మశానం అభివృద్ధి	01.00
టాటా ఎండీ డిజిటల్ నెర్వ్ సెంటర్-	05.00
మొత్తం	120.42

మంజూరైన పనులు

పనులు	వ్యయం (రూ.కోట్లలో)
వ్యవసాయ ఫీడర్లకు సోలరైజేషన్	564.00
మురుగునీటి కాలువల నిర్మాణం	110.21
చెరువులు, చెక్ డ్యామ్‌ల నిర్మాణం, మరమ్మతులు	87.08
ప్రధాన దేవాలయాల అభివృద్ధి	47.58
ఆర్ అండ్ బీ తారు రోడ్ల నిర్మాణం	38.45
హంద్రీ-నీవా కుప్పం బ్రాంచి కాలువ లైనింగ్ పనులు	37.95
టీటీడీ ద్వారా చిన్న దేవాలయాల అభివృద్ధి	33.67
సిమెంటు రోడ్లు	27.25
ఎస్సీ/ఎస్టీ గృహాలకు సోలరైజేషన్	21.80
గోకులం షెడ్లు	20.79
వ్యక్తిగత మరుగుదొడ్లు	19.77
33/11 కేవీ సబ్ స్టేషన్లు	18.01
ప్రాథమిక పాఠశాలల అభివృద్ధి	10.36
ఎన్టీఆర్ సుజల	08.22
వసతి గృహాల మరమ్మతులు	06.87
అన్న క్యాంటీన్లు	02.60
గ్రామ పంచాయతీ భవనాలు	02.60
కుప్పం ఏరియా ఆస్పత్రి అభివృద్ధి	01.57
ఓహెచ్‌ఆర్‌ఎస్ మరమ్మతులు	01.52
కుప్పం మున్సిపాలిటీ, స్పోర్ట్స్ కాంప్లెక్స్ సెంట్రల్ పార్క్ అభివృద్ధి	85.00
కేర్ ఎన్ గ్రో ప్రాథమిక బాల్య అభివృద్ధి కేంద్రాలు	02.90
మొత్తం	1167.61

వికలాంగ ధృవీకరణ పత్రాలు: 3200 మందికి
ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు: 7,034 మందికి
పక్కా ఇళ్ల లబ్ధిదారులు: 14,469 మంది

రేపటి నుంచే జోనల్ స్థాయి క్రీడా పోటీలు



శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బాడ్మింటన్ పోటీలకు ముస్తాబైన ఇండోర్ స్టేడియం

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు జోనల్‌స్థాయి క్రీడా పోటీలు కోలాహలంగా జరగనున్నాయి. ఈనెల 29న జాతీయ క్రీడా దినోత్సవం, హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని శాప్ ఆధ్వర్యంలో క్రీడా సంబరాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. జోనల్ స్థాయిలో సత్తాచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు. తొలిరోజు ఉదయం 10 గంటలకు ఎస్వీ స్టేడియంలో ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాప్ చైర్మన్ రవినాయుడు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకానున్నారు. డీఎస్‌డీవో శశిధర్ పర్యవేక్షణలో ఈ ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. వర్షం కారణంగా పోటీలు ఆగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. అలాగే 20న రిజర్వ్‌డేగా నిర్ణయించారు.

● 1,880మంది క్రీడాకారులు రాక : రాయలసీమ జోన్ పరిధిలో వచ్చే తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, అనంతపురం, సత్యసాయి, నంద్యాల, కర్నూలు జిల్లాల నుంచి మొత్తం 1,880మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. తిరుపతి జిల్లా నుంచి 235మంది క్రీడాకారులు పోటీ చేయనున్నారు.

● మైదానాలు ఇవే : జోనల్ పోటీల కోసం ఎస్వీ స్టేడియం, శ్రీనివాస క్రీడాసముదాయం, ఎస్వీ ఆర్ట్స్ మైదానం, ఎస్వీయూ స్పోర్ట్స్ ఎరీనాలను ముస్తాబుచేశారు.

పది పాఠశాలల్లో బస : క్రీడాకారులకు నగర పరిధిలోని పది మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలల్లో బస ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక రవాణా ఏర్పాట్లు, మూడు పూటలా భోజన సదుపాయం కల్పించారు. ఎంపికచేసిన 10పాఠశాలలకు డీఈవో ఆదేశాల మేరకు సోమ, మంగళవారాలలో సెలవు ప్రకటించారు.

తిరుమలలో గోకులాష్టమి



కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణస్వామికి అభిషేకం చేస్తున్న టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

తిరుమల, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): తిరుమలలో శనివారం గోకులాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. గోగర్భం డ్యాం వద్దనున్న కాళీయమర్ధనుడైన శ్రీకృష్ణస్వామికి పంచాభిషేకాలు చేశారు. స్థానిక యువతతో ఉట్లోత్సవం నిర్వహించారు. టీటీడీ గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. అలాగే రాత్రి శ్రీవారి ఆలయంలోని బంగారు వాకిలి వద్ద ఉగ్రశ్రీనివాసమూర్తి, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు, శ్రీకృష్ణస్వామికి ఏకాంతంగా తిరుమంజనం, ద్వాదశ ఆరాధన నిర్వహించారు. అనంతరం ప్రబంధ శాత్తుమొర, గోకులాష్టమి ఆస్థానం చేపట్టారు. కాగా ఆదివారం సాయంత్రం శ్రీవారి ఆలయం ముందు ఉట్లోత్సవం నిర్వహించనున్నారు. మలయప్పస్వామి, శ్రీకృష్ణస్వామి తిరుచ్చిలపై మాడవీధుల్లో ఊరేగనున్నారు.

కొండనిండా భక్తులు





తిరుమల శ్రీవారి ఆలయం భక్తజన సంద్రంగా మారింది. వరుస సెలవుల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కొండపై ఎటుచూసినా రద్దీ కనిపించింది. క్యూలన్నీ కిక్కిరిసిపోయాయి. పిల్లలు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.

ముక్కంటి సేవలో 30వేలమంది భక్తులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు రావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం ద్వారా 942 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 4,861, రూ.50 ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,919 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,798మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,488, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 479, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 373, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 109మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలను కలిపి 28,287 విక్రయించినట్టు ఆలయాధికారులు తెలిపారు.



మిస్ తిరుపతిగా సాత్విక

వెంకటగిరి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఫరెవర్ స్టార్ మిస్ ఇండియా ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి అందాల పోటీల్లో వెంకటగిరికి చెందిన బీటెక్ విద్యార్థిని చెన్నమనేని గమన సాత్విక విజేతగా నిలిచారు. ఈ మేరకు ఆ సంస్థ శనివారం ఆ విద్యార్థి పేరును మిస్ తిరుపతిగా ప్రకటించింది. వెంకటగిరి వ్యవసాయ మార్కెటింగ్ మాజీ చైర్మన్ సీసీ నాయుడు కుమార్తె అయిన సాత్విక గుంటూరులోని కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. మిస్ ఇండియా పోటీల్లో పాల్గొనడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆమె తెలిపారు.

ఎర్రచందనం దుంగల స్వాధీనం : ఒకరి అరెస్టు

మంగళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా పెంచలకోన వద్ద శనివారం టాస్క్‌ఫోర్సు పోలీసులు కూంబింగ్ నిర్వహించి నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం నెల్లూరు జిల్లా రాపూరు సమీపంలోని అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. పెంచలకోన వద్ద ఈదల చెరువు సమీపంలో కొందరు వ్యక్తులు వారి కంటబడ్డారు. పట్టుకునే ప్రయత్నం చేయగా ఒకరు మాత్రమే దొరికారు. సమీపంలో నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వ్యక్తి నెల్లూరు జిల్లాకు చెందిన వాడిగా గుర్తించారు. స్మగ్లర్‌తో పాటు ఎర్రచందనం దుంగలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ రఫీ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పెట్రోలు బంకుల్లో విజిలెన్స్ తనిఖీలు



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని పెట్రోలు బంకుల్లో శనివారం విజిలెన్సు అధికారులు తనిఖీలు చేపట్టారు. సీఎస్‌డీ గంగయ్య, లీగల్ మెట్రాలజీ విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, విజిలెన్సు సీఐలు వెంకటరవి, చంద్రశేఖర్ తనిఖీలు నిర్వహించారు. అక్కారంపల్లి సర్కిల్ వద్దనున్న వెంకటసాయి ఫిల్లింగ్ స్టేషన్ పంపుల్లోని కొలతల్లో వ్యత్యాసాలున్నట్లు గుర్తించి, రెండు నాజిల్స్‌ను సీజ్ చేశారు.